నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | డిసెంబర్ 02, 2024 | www.navatelangana.com

'ప్రభుత్వం 50 లక్షల కార్మికులను విస్మరించింది'

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో ఉన్న 25 లక్షల మంది రైతులకు పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం 50 లక్షల కార్మికులను ఎందుకు విస్మరిస్తుందో అర్థం కావడం లేదని రిటైర్ట్ లెబర్ ఆఫీసర్ జగదీష్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మర్వాడి ధర్మశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సక్షేమ పథకాలను అమలు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. కానీ అదే తరుణంలో కార్మికులను విస్మరించడం సరైన విధానం కాదన్నారు. విజయోత్స సంబరాలు జరుపుకుంటున్న ప్రభుత్వానికి కార్మికులు కనబడడం లేదాని ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కార్మిక శాఖ ద్వారా సంక్షేమ పథకాలను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

గోలేటి ఓపెన్ కాస్ట్ ప్రారంభించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో గోలేటి ఓపెన్ క్యాస్ట్‌ను వెంటనే ప్రారంభించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ కోవలక్ష్మి సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. శనివారం గోలేటిలోని జనరల్ మేనేర్ కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్‌ని కలిసి ఓపెన్ కాస్టు పరిస్థితులపై చర్చించారు .ఫారెస్ట్ భూమి క్లియరెన్స్ కాక ఓపెన్ కాస్ట్ ఆలస్యమవుతుందని జీఎం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారులతో కూడా చర్చిస్తామని వీలైనంత త్వరగా అనుమతుల కోసం అవసరమైతే అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తుతానన్నారు. బెల్లంపల్లి ప్రాంతంలో గోలేటి ఓపెన్ కాస్ట్, ఎంవీకే 3 ఓపెన్ కాస్ట్ ప్రారంభమైతే ఈ ప్రాంతంలో పర్మనెంట్ కార్మికులు, ప్రజలకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే ముగిసింది.. పల్లె సమరమే..!

● రెండు రోజుల్లో ముగియనున్న డాటా ఎంట్రీ ● పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం ● రిజర్వేషన్ల అంశం తేలగానే నోటిఫికేషన్ ● పల్లెల్లో అప్పుడే ఊపందుకున్న ఎన్నికల పర్వం

సమగ్ర కుటుంబ సర్వే ముగిసింది. ఇందుకు సంబంధించిన డాటా ఎంట్రీ ప్రక్రియ సైతం కొనసాగుతోంది. ఈ మరో రెండు, మూడు రోజుల్లో ఈ క్రతువు ముగియనుంది. దీంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తిచేసింది. పంచాయతీ ఎన్నికలు రిజర్వేషన్లతో ముడిపడి ఉండటంతో తాజాగా చేపట్టిన కుల గణన వివరాలు ప్రభుత్వానికి అందగానే వీటిని రిజర్వేషన్లు సవరించనున్నట్లు తెలుస్తోంది. కాగా మరో వారం రోజుల్లో ఈ ప్రక్రియ మొత్తం పూర్తికాగానే ఈ నెలాఖరులో లేదంటే జనవరి మొదటి వారంలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోపక్క ఇప్పట్నుంచే పల్లెల్లో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. వివిధ కులాలకు చెందిన ఆశావహ అభ్యర్థులు గ్రామస్తులను మచ్చిక చేసుకుంటూ వారి మన్ననలు పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తి రేపుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో సుమారు పక్షం రోజుల పాటు సమగ్ర ఇంటింటి సర్వే(కుల గణన) ప్రక్రియ ముగియగానే అందరి దృష్టి పంచాయతీ ఎన్నికలపైనే కేంద్రీకృతమవుతోంది. ప్రస్తుతం సర్వేకు సంబంధించి డాటా ఎంట్రీ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 80శాతం పూర్తికాగా.. మరో మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్లు వెల్లువెత్తడంతో ప్రభుత్వం సర్వే చేపట్టడం..ఇది పూర్తికావడం.. కులాల వారీగా జనాభా లెక్కలు వెల్లడికానున్నాయి. వీటి ఆధారంగా ప్రస్తుతమున్న రిజర్వేషన్లను సవరించి కొత్తగా జారీ చేయనున్నట్లు తెలిసింది. మరోపక్క ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసిపోవడంతో ప్రత్యేకాధికారులే పంచాయతీలను పాలిస్తున్నారు. పాలకవర్గాలు లేకపోవడంతో పల్లెలకు సంబంధించిన తీర్మాణాలు లేకపోవడంతో కేంద్రం నుంచే నిధులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పల్లెల్లో పారిశుధ్యలోపంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు సైతం అవరోధాలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని గతంలోనే ప్రభుత్వం భావించినా కులాల జనాభా లెక్కలు తీయాలని డిమాండ్లు వినిపించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తాజాగా సర్వే పూర్తికావడంతో ఈ నెలలోనే ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం..!

సర్పంచ్ ఎన్నికలకు ఈ నెలలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం ముందస్తుగానే అప్రమత్తమైంది. జిల్లాలో మూడు విడతల్లో వీటిని నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఇది వరకే పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేయగా.. బ్యాలెట్ పేపర్ల తయారీకి సైతం సిద్ధమైనట్లు తెలిసింది. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను ముందస్తుగానే సిద్ధం చేసిన అధికారులు వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపునకు షెడ్యూల్‌ను ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి ప్రకటన వెలువడగానే ఎన్నికల నిర్వహణకు అవసరమైన కసరత్తును పూర్తిచేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

పల్లెల్లో ఆశావహుల సందడి..!

సర్పంచ్ ఎన్నికలపై అనేక మంది ఆశావహులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ ఎన్నికలు ఉంటాయని భావించినా జాప్యం కావడంతో నిరుత్సాహానికి గురయ్యారు. తాజాగా సర్వే పూర్తికావడంతో మరికొన్ని రోజుల్లోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో ఆశావహులంతా పోటీ కోసం ఆసక్తి కనబరుస్తున్నారు. కులాల వారీగా ఓటర్లపై సొంతంగా సర్వే చేసుకుంటూ పోటీలో గెలుపోటములపై చర్చించుకుంటున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే తాము..లేదంటే తమ మద్దతుదారులను బరిలో దింపేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికలు అయినప్పటికీ.. పరోక్షంగా ఆయా పార్టీల తరపున బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో యువతే అధికంగా పోటీకి ఆసక్తి చూపిస్తున్నారు. సర్పంచ్‌గా గెలిచి రాజకీయాల్లో ప్రవేశించాలని ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో ఇప్పట్నుంచే గ్రామాల్లో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ప్రారంభించారు. తాము బరిలో ఉంటామని మద్దతివ్వాలని గ్రామస్తులను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. సర్పంచ్ ఎన్నికల పట్ల గ్రామాల్లోనూ ఆసక్తి ఉండటంతో అందరూ నోటిఫికేషన్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రచ్చబండ వద్ద సర్పంచ్ ఎన్నికలపైనే చర్చలు జరగడం వీటి ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో గ్రామాలు, వార్డుల వివరాలు ఇవి

జిల్లా	పంచాయతీలు	వార్డులు
ఆదిలాబాద్	468	3840
మంచిర్యాల	311	2730
నిర్మల్	396	3336
కుమురంభీం	335	2874

గురుకులాల్లో సౌకర్యాలు పెంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకులాల్లో రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు పెంచాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ గురుకుల బాటలో భాగంగా స్థానిక పీటీజీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో గురుకులాలు అధ్వానంగా తయారయ్యాయని, కనీస వసతులు లేక అల్లాడుతున్నాయని ఆరోపించారు. తన ప్రభుత్వ హయాంలో గురుకులాల్లో విద్యార్థులు ఆనందంగా ఉన్నారని ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా పరిశీలకులు బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి ఎండి ముస్తఫా, విద్యార్థి విభాగం నాయకులు అలిభాయి, సాగర్, శ్రవణ్, ప్రవీణ్, శ్రీకాంత్, రాంశేఖర్, తాజ్, అరుణ్ పాల్గొన్నారు.

ఆడియో సీడీని ఆవిష్కరించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్


ప్రజాపాలన విజయోత్సవాలు సందర్భంగా ఆదివారం జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సారథి కళాకారులచే రూపొందించిన ప్రజాపాలన ఆడియో పాటను కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సంబరాల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రం లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సాంస్కృతిక సారథి కళాకారులచే రూపొందించిన ప్రజాపాలన ఆడియో సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 7 వరకు జిల్లాలోని మండలాల్లోని ఆయా గ్రామాల్లో, మున్సిపాలిటీలలో రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ లు మహాలక్ష్మి, ఇందిరా మహిళాశక్తి, గృహ జ్యోతి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లపై కళాకారుల ఆటపాటలతో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతి మండలం నుంచి మూడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ తిరుమల, జిల్లా అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను ఖండిస్తున్నాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగ్లాదేశ్‌లో మైనార్టీలు హిందువులపై చేస్తున్న దాడులను ఖండిస్తున్నామని ఇస్కాన్ స్వామి శ్రీ మాన్ గౌరు నామా ప్రభుజి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఇస్కాన్ ఆలయంలో సనాతన హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలు హిందువులపై, హిందూ దేవాలయాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేయడమే కాకుండా ప్రపంచంలోని ప్రజలకు శాంతి మార్గంలో భక్తిని బోధిస్తున్న ఇస్కాన్ స్వామీజీలను అరెస్ట్ చేయడమే కాకుండా బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం శోచనీయమాన్నారు. వెంటనే ప్రభుత్వం బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చించి, అక్కడ శాంతియుత వాతావరణం కల్పించుటకు తగిన చర్యలను తీసుకోవాలని అన్నారు. బంగ్లాదేశ్‌లో అరెస్టు అయిన చిన్మయ కృష్ణదాస్‌ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, కోశాధికారి సూర్యకాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కందుల రవీందర్, ఇస్కాన్ భక్తులు పూర్ణ కృష్ణదాస్, శ్రీనివాస్‌దాస్, రాజేందర్, వికంత్, మహిళా భక్తులు విషలిని, ప్రసాన్న కుమారి, విష్ణు ప్రియ, రసిక మాతాజీ ఉన్నారు.

ఉద్యమకారులను ప్రజలు మరువరు



నవతెలంగాణ-ఉట్నూర్

మహిళలను గౌరవిస్తూ, మద్యానికి బానిస కాకుండా, డబ్బులకు ఆశపడకుండా జాతి ప్రజల పక్షాన పోరాటాలు, ఉద్యమాలు చేసే ఉద్యమకారులను ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం ఉద్యమాలు చేసిన ఉద్యమకారుడు ఉయిక సంజీవ్ సంస్కరణ సభ ఆదివారం పట్టణంలోని కేబి కాంప్లెక్స్ ఎమ్మార్సీలో తుడుం దెబ్బ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతరం ఆదివాసీ హక్కుల కోసం నిస్వార్థంగా ఎందరో ఆదివాసీ అమరులు కృషి చేశారని అన్నారు. ఉయిక సంజీవ్ కుటుంబాన్ని ఆదుకుంటానని, వారి కూతురుకు చదువుకు ఖర్చు అయ్యేది తానే పూర్తిగా భరిస్తానని హామీ ఇచ్చారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర కన్వీనర్ పురుష పోచయ్య, రాష్ట్ర కార్యదర్శి గోడం గణేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పంద్ర జై వంతరావు, పుష్పరాణి, ఆత్రం సుగుణ, ప్రజాసంఘాల నాయకులు బానోతు రామారావు, నేతావత్ రాందాస్ నాయక్, రంగన్న, అజయ్, రమణ, పెందుర్తి ప్రభాకర్ అడ్వకేట్, కుడుమేత విశ్వనాథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ జైనూర్, కనక రామారావు, భాస్కర్, వినోద్, రమేష్, విఠల్, తిరుపతి, ఆత్రం తిరుపతి, ఆత్రం రవీందర్, అశోక్, పెందూర్ గోపి అడ్వకేట్, ఆత్రం నగేష్, శేఖర్, ఇందిరా బాయి, ఆత్రం తిరుపతి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు ప్రజలు చైతన్యవంతులు కావాలి

● డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎయిడ్స్ డే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏయిడ్స్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ప్రజలను చైతన్యవంతులు చేయడమే మార్గమని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఏయిడ్స్ దినత్సోవం సందర్భంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు ఏయిడ్స్ వ్యాప్తి, నివారణ, విద్యార్థుల పాత్ర తదితర అంశాలను పలువురు తెలియజేశారు. అనంతరం ఏయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఏటా ఏయిడ్స్ అవగాహన కల్పిచడంతో పాటు బాధితులకు సానుభూతి తెలుపుతూ చనిపోయిన వారికి నివాళు లర్పించడానికి ఏయిడ్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఏయిడ్స్ నివారణ అవగాహనతోనే సాధ్యమన్నారు. ఇది ప్రాణాత్మక వ్యాధి కాదని, దీర్ఘకాలిక వ్యాధుల్లో పరిగణిస్తామన్నారు. అనైతిక లైంగిక సంబంధల వల్ల ఎక్కువగా వస్తుందని, సురక్షితమైన ఇంజెక్షన్ లు లేక పోవడంతో వ్యాప్తి చెందుతాయన్నారు. ఏయిడ్స్ తెలిసి రావొచ్చు తెలియక రావొచ్చు దానికి వారు బాధ్యులు కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. బాదితులను బహిష్కరించడం చట్టరీత్య నేరమన్నారు. ఈ విషయాలు విద్యార్థులు తెలుసుకొని పలువురికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జాతీయ సదస్సులో ఆదివాసీ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యూ ఢిల్లీలో జరుగతున్న ఆదివాసీ నిరుద్యోగ సదస్సులో జిల్లా నుండి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ నుండి ఆదివాసీ విద్యార్థి సంఘం (టీఏవీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుష్ మాట్లాడుతూ ప్రమోషన్ విషయంలో ఆదివాసీ టీచర్స్‌కు తెలంగాణలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ టీచర్స్‌కి హెచ్‌ఎం తర్వాత ప్రమోషన్ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. జనరల్ విద్యా శాఖలో టీచర్ హెచ్‌ఎం, ఏంఈఓ, డీఈఓ వరకు పదోన్నతులు ఇస్తున్న గిరిజన శాఖలో మాత్రం పదోన్నతి లేదని తెలిపారు. ఏజెన్సీలో జీఓ 3 అమలు చేసి ఐటీడీఏ ద్వారా అన్ని శాఖల్లో గిరిజన యువత ద్వారా ఉద్యోగ భర్తీ చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఆదివాసీ నిరుద్యోగ సమస్య, ఉద్యోగాల్లో ఆదివాసుల తొలగింపు అంశంపై జాతీయ సదస్సు జరిగిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా కేంద్రంలోని బీజేపీ ఆదివాసుల రిజర్వేషన్ తొలగింపు, ఆదివాసీ రిజర్వ్ ఉద్యోగాల తొలగింపు పక్రియ చేస్తూ ఆదివాసులకు ఉపాధి దూరం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్, టీఏజీఎస్ నాయకులు తొడసం భీంరావు, ఉయిక విష్ణు, కిష్టన్న, సోమేశ్ పాల్గొన్నారు.

కాలం చెల్లిన సరుకులు వాడొద్దు

● వసతి గృహం తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాలం చెల్లిన సరుకులు వాడొద్దని, సరుకులు తెచ్చేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలు పాటించి ఆహారాన్ని అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్ డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ప్రజాపాలన విజయోత్సవాలు సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ ఆరు గ్యారంటీలపై వివరించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఎలాంటి ఒత్తిడికి లోనూ కాకుండా శ్రద్ధతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని అన్నారు. వసతి గృహం సందర్శించి సరుకుల నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. డైనింగ్ హాల్, వంట గది ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

అడవికి నిప్పుతో వన్యప్రాణులకు ముప్పు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అడవికి నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులకు ముప్పు వాటిల్లుతుందని వావుదాం బీట్ అధికారి అమరేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని గంటలగూడెం, కాప్రి, బనారుగొంది గ్రామాల ప్రజలకు అడవికి నిప్పు పర్యావరణ ముప్పు, అటవీ జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రానున్న వేసవి కాలం నేపథ్యంలో అటవీ ప్రాంతాలకు వెళ్లే పశువుల కాపరులు నిప్పు వెలిగించకూడదన్నారు దీంతో అటవీ ప్రాంతం కాలిపోయి పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. గిరిజనులకు గతంలో ఇచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్నంత వరకు మాత్రమే భూమి సాగు చేసుకోవాలన్నారు. ఎక్కువగా సాగు చేస్తే పీడీ చట్టం కింద కేసు నమోదు చేయాల్సివస్తుందని తెలిపారు. అలాగే అడవిలో దొరికే ఇప్పపువ్వు ఇతర పండ్ల సేకరణ ద్వారా ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అటవీ సంరక్షణలో గ్రామస్తులు తమకు సహకరించాలని కోరారు. అక్రమ కలప తరలించకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా అక్రమంగా కలప తరలిస్తే అటవీ అధికారులకు తెలియజేయాలన్నారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీ జంతువుల సంరక్షణ వల్ల పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వావుదాం గ్రామ మాజీ సర్పంచ్ కీర్తనరావు, ఆయా గ్రామాల పటేళ్లు ఆత్రం రాజు, ఆత్రం భీము, బనారు గొంది వీఎస్ఎస్ అధ్యక్షుడు టేకం రాజు పాల్గొన్నారు.



యోగులు ఇచ్చిన జ్ఞానంతో జీవితంలో ముందుకు సాగాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యోగులు, మహాపురుషులు ఇచ్చిన జ్ఞానంతో జీవితంలో ముందుకు సాగాలని పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటి మూవ్‌మెంట్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమామహేష్ అన్నారు. ఆదివారం గోపాల కృష్ణమఠంలో సొసైటీ ఆధ్వర్యంలో భిన్నంగా ఆలోచించు అనేక అంశంపై అవగాహన కల్పించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనలు, రోజు ఎలా చేయాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటి మూవ్మెంట్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమామహేష్ మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అన్నారు. గురువులు, యోగులు ధ్యానం గురించి ఎంతో చెప్పారన్నారు. వారు సన్యసం తీసుకోవాలని చెప్పలేదని, వారు అనుసరించిన విధానాలను మాత్రమే పాటించాలని చెప్పారన్నారు. ఆధ్యాత్మికం అంటే ఆనందంగా, అద్భుతంగా జీవించడమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ జీవితంలో ధ్యానం చేస్తూ ఓత్తిడి జయించడంతో పాటు సమస్యలను కూడా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటి మూవ్మెంట్ ఆదిలాబాద్ శాఖ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి సుంకరి రమేష్, సభ్యులు నాగుల వెంకట్, కందుల జితేందర్, నవీనిత్ రెడ్డి, అంజిత్ కుమార్, రమాకాంత్, పెంటజీ, మహిళ ప్రతినిధులు సునీత, భారతి, రోజారాణి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | డిసెంబర్ 02, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో 8 గొర్రెలు మృతి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పిప్రి గ్రామ సమీపంలోని ప్రధాన



రహదారిపై ఆదివారం ఉదయం కంకర లోడుతో ఇచ్చోడ వైపు వెళ్తున్న టిప్పర్ వాహనం వెళ్తుండగా ప్రమాదవశాత్తు గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. అదే గ్రామానికి చెందిన కుర్మా మల్లేష్ అనే రైతుకు సంబంధించిన ఎనిమిది గొర్రెలు మరణించాయి. దీంతో రైతు టిప్పర్ యజమానిపై చర్యలు తీసుకుని నష్టపరిహారం అందించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో డిసెంబర్ 5వ తేదీ నుంచి నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సంబంధించిన కరపత్రాలను మాజీ మంత్రి జోగు రామన్న విడుదల చేశారు. ఆదివారం శాంతినగర్‌లోని మాజీ మంత్రి జోగు రామన్న నివాసంలో బజార్‌హత్నూర్ మండల యూత్ అధ్యక్షులు చంద్రశేఖర్‌తో కలిసి ఆవిష్కరించారు. పార్టీ ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ క్రీడాలను ప్రోత్సహించడం ద్వారా క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యం మెరుగుపడుతుందని అన్నారు. క్రీడాకారులకు జోగు ఫౌండేషన్ తరపున ప్రత్యేక ప్రోత్సహించడం జరుగుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జనార్ధన్, ప్రభాకర్, సుకుమార్, మనివర్ధన్ పాల్గొన్నారు.



సింహగర్జన సభకు తరలిన మాలలు



నవతెలంగాణ-నార్నూర్

హైదరాబాద్‌లో ఆదివారం తలపెట్టిన మాల సింహగర్జన సభకు ఉమ్మడి మండలం నుంచి మాలలు భారీగా బయలుదేరారు. సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి మండలం నుంచి మూడు వందల పైన ప్రజలు బయలుదేరినట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీలు అందరూ ఒక్కటేనని ఎస్సీ కులంలో వర్గీకరణ వర్గాలు చేయకుండా చూడాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బయలు దేరిన వారిలో లోఖండే దేవరావు, చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ హేమలత బ్రీజులాల్, రేవయ్య చరణ్ దాస్, ప్రకాశ్, రాజేందర్, విఠల్, సునీల్, కేశవ్‌రావ్, విజయ్, సుదర్శన్, మహిళ సంఘాల నాయకురాలు రుక్మిణి, మినా, నిర్మల, లోనాబాయి, శారదా, రేవతి చంద్రకళ, పద్మ ఉన్నారు.

వార్డులో పర్యటించిన మున్సిపల్ ఛైర్మెన్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని 14వ వార్డు విద్యానగర్ కాలనీలో ఆదివారం మున్సిపల్ ఛైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సానిటేషన్ పరంగా ఖాళీ ప్లాట్లలో, డ్రైనేజీ వెంబడి పిచ్చి మొక్కలు గుబురుగా పెరగడంతో పిచ్చి మొక్కలను తొలగించి, వార్డును శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. త్వరలోనే డ్రైనేజీ రోడ్డు సమస్యలు పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఆదివారం ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ విజయ్ కుమార్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అందించే పథకాలు విద్యార్థులు దృష్టిలో ఉంచుకొని మంచి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని తెలిపారు. అదే విధంగా వసతి గృహంలో కల్పించే మౌలిక సదుపాయల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు వసతి గృహంలో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి, పల్సి ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు గంగాధర్, రాజేశ్వర్, విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బోథ్

మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక వాగ్దేవి కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూది నరేష్, ప్రధాన కార్యదర్శిగా గొడిసెల రమణ గౌడ్, కోశాధికారిగా లింగంపల్లి సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో ఈనెల 4న నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఈనెల 4న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని హిందూ బంధువులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇస్కాన్ సంస్థ కుల మతాలకతీతంగా పనిచేస్తాయని అన్నారు. బంగ్లాదేశ్ ఇస్కాన్ ఆలయాలపై హిందువులపై జరుగుతున్న దాడులను ప్రపంచం మొత్తం ఖండిస్తుందన్నారు. బంగ్లాదేశ్ హిందువులకు తాము అండగా ఉన్నామని భరోసా కల్పిద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, నగేష్, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, జోగు రవి, దినేష్ మాటోలియ, విజయ్, రాజన్న, సోమరవి, దయాకర్, అర్జున్ ఉన్నారు.

కేజీబీవీలో చల్లటి నీళ్లే దిక్కు

- మూలన పడ్డ ఆర్వో ప్లాంటు
- చల్లని నీటితో స్నానాలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ఏజన్సీలోని గిరిజన విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలలతో పాటు కేజీబీవీలో ఉచిత విద్యను అందిస్తోంది. వీరికి మెనూ ప్రకారం భోజనంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులను ప్రతి ఏటా పంపిణీ చేస్తారు. దీనితో పాటు చలి నుంచి రక్షించేందుకు దుప్పట్లతో పాటు సోలార్ ద్వారా వేడి నీళ్లను అందించాలనే నిబంధన ఉంది. వివిధ ఆశ్రమాలు, కేజీబీవీలో చదివే విద్యార్థులు రోగాల బారిన పడకుండా శుధ్య జలం అందించాలనే ఉద్యేశంతో ఆర్వో ప్లాంటులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి కోసం ఒక్కో ప్లాంటుకు లక్షల రూపాయలను ఖర్చు చేశారు. కొన్ని రోజులు బాగానే పని చేసిన, ఈ ప్లాంటు కాల క్రమేనా చిన్న చిన్న మరమ్మత్తులు పేరిట పని చేయడం లేదు. దీంతో అవి ప్రస్తుతం పని చేయక మూలనపడ్డాయి. ఐటీడీఏ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు శుద్ధమైన తాగు నీరు, స్నానికి వేడి నీళ్ల అందక చలికి గజగజ వణికి పోతున్నారు. గత నెల మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల బాలికలలో ఓ విద్యార్థిని వాంతులు విరేచనాలతో మరణించింది. అప్పట్లో అధికారులు అక్కడి ఏఎన్‌ఎంను బాధ్యులుగా చేస్తూ విధుల నుంచి తొలగించారు. డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. మండలంలో పిట్ట బొంగరం, వడగావ్, కెస్లాపూర్, ఇంద్రవెల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలు, హీరాపూర్‌లో కేజీబీవీ విద్యాలయాలు ఉన్నాయి. అయితే ఎక్కడ కూడ శుద్ధ జలంతో పాటు సోలార్ ప్లాంట్లు పనిచేయడం లేదు. దీంతో చలికాలంలో గజగజ వణుకుతూ చల్లని నీటితోనే స్నాలు చేస్తున్నారు. చాల చోట్ల ఆర్వో ప్లాంటు సైతం పనిచేయక పోవడంతో విద్యార్థులకు తాగునీరు అందక అనారోగ్యానికి గురవుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



పోలీస్ కిష్టయ్య విగ్రహా ఏర్పాటుకు కృషి

- మున్సిపల్ ఛైర్మెన్ గంద్రత్ ఈశ్వర్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నిర్మల్ ముదిరాజ్ సంఘ సభ్యులు, మున్సిపల్ ఛైర్మెన్ గంద్రత్ ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం సమీపంలో పోలీస్ కిష్టయ్య విగ్రహా ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ ఛైర్మెన్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మెన్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన కిష్టయ్య విగ్రహం ఏర్పాటుకు కౌన్సిల్ తరపున తీర్మానానికి కృషి చేస్తానని అన్నారు.

సిరికొండ : మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన పోలీసు కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమం చేసి అమరుడైన కిష్టయ్య వర్ధంతి, జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆ సంఘం సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఒరగంటి విజయ్ కుమార్, సంఘ నాయకులు పెంటన్న, మల్లారెడ్డి, నడ్పి మల్లేష్, ఇస్తారి, ఆశన్న, లక్ష్మణ్, అశోక్, గంగన్న, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

ఖానాపూర్ : తెలంగాణ పోరాట మలిదశ తొలి అమరుడైన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతిని పురస్కరించుకొని ఘన నివాళు లర్పించారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బోథ్ : మండలంలోని కౌటా(బి) గ్రామంలో పోలీస్ కిష్టయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మందుల రమేష్, మండల అధ్యక్షులు జుంగాల భోజన్న ముదిరాజ్, కౌట(బి) గ్రామ అధ్యక్షులు సున్నపు శ్రీనివాస్ ముదిరాజ్, నాయకులు జెట్టి రాజేశ్వర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ లంకటి నర్సయ్య పాల్గొన్నారు.

ముధోల్ : మండలంలోని కొత్త బస్టాండ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ప్రవీణ్, సాయి, బీజేపీ మండలాధ్యక్షులు కోరి పోతన్న పాల్గొన్నారు.



అభివృద్ధి తెలియజేయడానికే పాలన విజయోత్సవాలు

- 2కే రన్ ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడంలో భాగంగా ప్రజాపాలన విజయోత్సవాలను డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి 2కే రన్‌ను చేపట్టారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వల చేసి రన్‌లో పాల్గొన్నారు. ముందుగా ఆయా క్రీడాల్లో రాణించి క్రీడాకారులను కలెక్టర్ సత్కరించారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ప్రజాపాలనపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. అదే విధంగా ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను రోజుకో శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శాఖల ద్వారా జరిగిన అభివృద్ధిని తెలియజేస్తారన్నారు. అదే విధంగా ఈనెల 9వ తేదీ వరకు సాంస్కృతిక కళాకారులు 114 జీపీల్లో ప్రజాపాలనపై పాటల ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. పది రోజుల కార్యక్రమాల్లో పెద్దపల్లిలో గ్రూప్-4లో ఉద్యోగాలు సాధించిన వారికి అపాయింట్‌మెంట్ లెటర్‌లను సీఎం చేతుల మీదుగా అందిస్తారన్నారు. అదే విధంగా ప్రజాపాలనపై ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించామని, ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకుంటూ ఇతరులను చైతన్యవంతులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, డీవైఎస్‌ఓ వెంకటేశ్వరు, డీఐఈఓ రవీందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఎంఓ శ్రీధర్, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి ఉన్నారు.



మధుర సంఘం జిల్లా అధ్యక్షుడిగా చవాన్ కైలాస్



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలోని స్థానిక జిన్నింగ్‌లో ఆదివారం మధుర సంఘం ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చవాన్ కైలాస్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మధుర సంఘానికి రెండవ సారి ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కేజీబీవీ కడెం, లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ జెడ్పీహెచ్‌ఎస్, మామడ జెడ్పీహెచ్‌ఎస్, కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ టిఎస్ డబ్ల్యూఆర్‌ఎస్, ముధోల్, తానూర్ ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అధికారులు, ఉపాధ్యాయులు అందజేశారు. ఈ వ్యాసరచన పోటీలలో జిల్లా విద్యాధికారి పి.రామారావు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-నార్నూర్



పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపెల్లి గ్రామానికి చెందిన జాదవ్ చంటి(22)గత కొన్నేండ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మూడు రోజుల కింద ఇంటికి వచ్చి పరుగులమందు తాగి ఆత్మహత్య పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. దీంతో ఆ కుటుంబంలో విషాదచ్చాయలు అలుముకున్నాయి.

అనాధాశ్రమం పేరుతో డబ్బుల వసూలు

నవతెలంగాణ-కడెం

జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు ఆదివారం మండలంలోని పాండావపూర్, కొండుకూర్ గ్రామాల్లో అనాధాశ్రమం పేరుతో ఇంటింటికి తిరుగుతూ మినిమం రూ.వంద, 2వంద, వసూలు చేస్తుండగా అనుమానం వచ్చి కొండుకూర్ గ్రామానికి చెందిన యువకులు నిలదీయగా తప్పుడు అనాధాశ్రమం పేరు చెప్పి తామే డబ్బులు వసూలు చేస్తున్నామని నిజం ఒప్పుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇద్దరు మహిళలను ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఎస్సైని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-బేల

బేల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దివ్యభారతిని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కలిసి ఎస్పీతో దిగిన ఫోటోను అందించి శాలువాతో ఆమెను సత్కరించారు. ఎస్సైను కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అవినాష్, జైనథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీతారాం, భోక్రే శంకర్, రాక్రె సాగర్ ఉన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో రోడ్డుకు గుంతలు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలంలోని రాచాపూర్, అక్కాపూర్ గ్రామాల మధ్య రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. మొరం తరలించే వాహనాలు పరిమితికి మించి బరువుతో వెళ్లడంతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయని, దీంతో అటువైపుగా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోయారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చి భారీ వాహనాలు ప్రయాణించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గ్రామ సమస్యల పరిష్కారం కోసం తన వంత కృషి చేస్తానని మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకుసాపూర్ నుండి ఎస్సీ కాలానికి సీసీ రోడ్డు నిర్మణానికి కృషి చేస్తానని, అంబేద్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ నిధులతో వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ గౌడ్, సత్యనారాయణ, నర్సింహులు, సుగుణాకర్, జయరాజ్ పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-తిర్యాణి



మండలంలోని దేవాయిగూడ గ్రామపంచాయతీ తోయగూడా ఆవాసంలో 37 కుటుంబాలకు గోలేటికి చెందిన సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ సిద్ధి వీరేశం మాట్లాడుతూ చలి అత్యధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో వెనుకబడిన గిరిజనులు, ఆదివాసులకు దుప్పట్లు పంచాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు. బీట్ అధికారులు అనిల్, ప్రకాష్ మాట్లాడుతూ పులి సంచారం పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో గోలేటి గ్రామ పెద్దలు బలరాం నాయక్, దుప్ప నాయక్, రాజు నాయక్, భిక్షునాయక్, బాపురావు, దేవాయిగూడా మాజీ సర్పంచ్ హన్మంత్ రావు, తోయగూడా పటేల్ దేవ్‌పటేల్ పాల్గొన్నారు.

దానాపూర్ సమీపంలో మేకల మందపై పులి దాడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండలంలోని దానాపూర్ గ్రామ సమీపంలో మేకల మందపై పులి దాడి చేసింది. మేకల కాపరి పులి వచ్చినట్లు గమనించగానే గ్రామంలోకి పరుగులు తీసి విషయం తెలిపాడు. గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి చూడగా ఎనిమిది మేకలకు గాను ఒక మేక చనిపోయి ఉండగా, మరో మేక గాయపడి, ఇంకొక మేక కనిపించకుండా పోయింది. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారులు రాజేష్, సాదిక్, వెంకటేష్ అక్కడికి చేరుకొని పులి దాడి చేసిందా లేదా చిరుత పులి దాడి చేసిందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి పరిసర ప్రాంతాల్లో కలియతిరిగారు. దాదాపు నాలుగు గంటల పాటు అటవీ ప్రాంతంలో తిరిగిన వారికి ఆనవాళ్లు పూర్తిగా కనిపించకపోవడంతో స్పష్టతకు రాలేకపోయామని తెలిపారు. ఏది ఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులినా కాదా అనే విషయం తెలియజేయడానికి మరింత సమయం పడుతుందని వివరించారు. అయితే మేకల కాపరి మాత్రం మేకలపై పులి దాడి చేసిందని చెప్తున్నారు. ఇప్పటికే రెండు రోజుల నుండి జిల్లాలో పులి కలకలం రేపుతుండగా, మరో పులి ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాల్లోకి రావడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది.

పులి దాడి పాలకులదే బాధ్యత



నవతెలంగాణ-బెజ్జూర్

పులి దాడిలో మహిళ మృతికి పాలకుల బాధ్యత వహించాలని కోయ గొండ్వాన జిల్లా అధ్యక్షులు సోయం చిన్నయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులిలో మృతి చెందిన యువతికి మృతికి సిరిపూర్ ఎమ్మెల్యే బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టైగర్ కారిడార్ పేరుతో కాగజ్‌నగర్ డివిజన్‌లో పులులను సంరక్షిస్తున్నారని, టైగర్ కారిడార్ వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యువత మృతికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తలండి మధుకర్, మండల అధ్యక్షులు కోరత తిరుపతి, నాయకులు సకారం, కోట సతీష్, సాయి కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

జ్ఞాననంది అవార్డును అందుకున్న అధ్యాపకుడు



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న నోముల చంద్రశేఖర్ జ్ఞాననంది అవార్డు అందుకున్నారు. ఆర్ట్ ఆఫ్ లెర్నింగ్ ఇంటర్ నేషనల్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాజు గానసభ కళానిలయంలో బోధనలతో పాటు చేస్తున్న సాహిత్య, ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపుగా జ్ఞాననంది ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. ఆనందమయ జీవితానికి ఆధ్యాత్మిక, మానసిక ఉల్లాసానికి జ్ఞానానికి సాహిత్యం చాలా దోహదం చేస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డులను సొంతం చేసుకున్న అధ్యాపకుడు నోముల చంద్రశేఖర్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలో మండల విద్యార్థులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి యువ సంఘటన స్కూల్‌లో జరిగిన అండర్-14 నెట్ బాల్ (బాలురు) పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 6,7,8 తేదీలలో కరీంనగర్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు 7వ తరగతి చదువుతున్న ఎస్‌కే ఆయాన్, ఈ.బన్ని సెలెక్ట్ అయినట్లు పాఠశాల పీడీ హరీష్ తెలిపారు, ఎంపికైన విద్యార్థులను, కృషి చేసిన పీడీని ఎంఈఓ పి.జయరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.



కేజీబీవీ నియామకాల్లో పైరవీలు..?

- పరేషాన్‌లో దరఖాస్తుదారులు
- బోధనేతర సిబ్బంది ఎంపికపై అనుమానాలు
- ఆందోళనలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం నిరుద్యోగుల సంఖ్య పెరగడం ప్రయివేట్ సంస్థల్లో శ్రమ దోపిడీ, జీతాల లేమి ఉండడంతో ప్రభుత్వ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగాలకు కూడా డిమాండ్ పెరిగింది. నిరుద్యోగుల ఆశలను సొమ్ము చేసుకునే ఉద్దేశంతో ఇదే అదునుగా కేజీబీవీలలో బోధనేతర సిబ్బంది నియామకాల్లో పైరవీకారులు చేతివాటం కారణంగా అర్హులైన అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఉద్యోగం ఇప్పిస్తామని పలుచోట్ల కొంతమందికి హామీ ఇస్తుండడంతో అర్హులైన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

కేజీబీవీ నియామకాల్లో పైరవీలు..?

జిల్లాలోని 15 కేజీబీవీలలో ఖాళీగా ఉన్న 46 వివిధ రకాల బోధనేతర సిబ్బంది కోసం గత నెల మొదటి వారంలో అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇదే అదునుగా కొన్ని మండలాల్లో అధికార పార్టీకి చెందిన చోటమోటా నాయకులు పైరవీలు ప్రారంభించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను ఒప్పిస్తున్నట్లు తెలిసింది. అధికారులు ఇంకా నియామక ప్రక్రియ ప్రారంభం కాకముందే పైరవీలు ప్రారంభమయ్యాయి.

పరేషాన్‌లో దరఖాస్తుదారులు

కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది కోసం ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు పరేషాన్‌లో ఉన్నారు. అటెండర్‌తో పాటు హెడ్ కుక్, కుక్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు గుర్తించిన అధికారులు స్థానికులకు మాత్రమే అవకాశం ఉంటుందని ప్రకటించగా, ఒక మండలంలో వేరే జిల్లా నుండి వచ్చిన వ్యక్తి అధికార పార్టీ నాయకులతో మంతనాలు జరుపుతూ తన భార్యకు ఇప్పించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే పైన తెలిపిన పోస్టులకు స్థానిక మండలాల్లో ఒకటి నుండి ఏడో తరగతి వరకు చదివిన వ్యక్తి మాత్రమే అర్హులు. అలా లభ్యం కాని సందర్భంలో పక్క మండలాల వారికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది.

బోధనేతర సిబ్బంది ఎంపికపై అనుమానాలు

జిల్లాలో ఖాళీగా ఉన్న 46 బోధనేతర పోస్టుల నియామకంలో దరఖాస్తుదారులు, నాయకులు చూపుతున్న అత్యుత్సాహంతో పలు అనుమానాలకు తెరలేస్తోంది. ఇదే విషయంపై డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రాలు అందించి ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని కోరడంతో అనుమానానికి బలం చేకూరినట్లు అయింది. ఎటువంటి పైరవీలకు చోటు లేకుండా అర్హులైన వారిని నియమించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

కమిటీల ద్వారా నియామకాలు

ఉదయబాబు, జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు



కేజీబీవీలో బోధనేతర సిబ్బంది నియామకం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎంపిక చేస్తాం. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. స్థానిక మండలాలకు చెందిన వారికి తొలి ప్రాధాన్యత ఉంటుంది.

అర్హులైన వారికి ఇవ్వకుంటే ఆందోళన

దుర్గం దినకర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు



కేజీబీవీ నియామకల్లో అర్హులైన స్థానికులకు అవకాశం ఇవ్వకుండా ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారికి అవకాశం ఇస్తే ఆందోళన చేస్తాం. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోలిస్తే ఆసిఫాబాద్‌లో నిరుద్యోగ ఎక్కువగా ఉంది. అధికారులు ప్రస్తుత నియామకాలు ఇతర జిల్లాల వారికి అవకాశం ఇవ్వకూడదు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- చీఫ్ కన్జర్వేటర్ ఏలూసింగ్ మెస్రూ



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పులి దాడుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీఫ్ కన్జర్వేటర్ ఏలుసింగ్ మెస్రూ ప్రజలకు సూచించారు. ఆదివారం మండలంలోని ఇటిక్యాల్ పహాడ్ గ్రామంలో కన్జర్వేటర్ శాంతారామ్, డీఎఫ్ఓ నీరజ్ కుమార్, ఫ్లైన్స్ కార్డ్ వేణు బాబుతో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పులులు సంచారం పెరిగిన నేపథ్యంలో ప్రజలు తమ స్వీయ రక్షణ కోసం మాస్కులు ధరించాలని, ఒంటరిగా అటవీ ప్రాంతంలో తిరగొద్దని సూచించారు. ప్రస్తుత కాలంలో పులులు ఆవాసం కోసం సంచారం చేస్తాయని ఈ క్రమంలోనే అటవీ ప్రాంత సమీపంలో తిరుగుతాయని తెలిపారు. మాస్కులను వెనుక భాగంలో ధరించి చేను పనులకు వెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా మాస్కులను పంపిణీ చేశారు. ఈయన వెంట ఎఫ్ఆర్ఓ ఇక్బాల్, సిర్పూర్ రేంజ్‌లోని ఫారెస్ట్ అధికారులున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు సంక్షేమ ఫలాలు అందించే విధంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కృషి చేస్తుందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో-కన్వీనర్ దుర్గం రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఎన్నికైన బాబురావు, తెలంగాణ ఉద్యమంలో జైలు జీవితం గడిపిన తోట లక్ష్మణ్, వినోద్ జైస్వాల్, కోట రాజయ్యలను ఆదివారం గోలేటిలో శాలువతో సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి ఉద్యమకారుల సమస్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవిస్తూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర సమరయోధులుగా గుర్తించాలని కోరారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్, గుర్తింపు కార్డులతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు దయాకర్, దాసరి శ్రీనివాస్, పుదరి సాయి, పార్వతీ అశోక్, ఆసీఫ్, గణేష్, అరవింద్, గోపాల్, రాయమల్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు చికిత్స లేదు..నివారణ ఒక్కటే మార్గం

- డీఎంహెచ్ఓ సీతారాం నాయక్
- ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం



ఆసిఫాబాద్ : డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట అవగాహన పత్రాలతో ఆరోగ్య సిబ్బంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎయిడ్స్‌కు చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సీతారాం నాయక్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి నుండి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1988వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ సోకిన ప్రతి గర్భిణీకి 14వ వారం నుండి నూతన చికిత్సా విధానాన్ని సెప్టెంబర్ 2012 నుంచి జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. దీనికోసం జిల్లాలో మొత్తం 22 సెంటర్లను ఏర్పాటు చేశామని వివరించారు. వీటిలో ఐసీటీసీ సెంటర్లు 2, ఎఫ్ఐసీడీసీ సెంటర్లు 18, ఏఆర్టీ సెంటర్లు రెండు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు మెమోంటో, సర్టిఫికెట్స్ అందచేశారు. కార్యక్రమంలో వైద్యులు అజీమ్, అజ్మత్, మహేష్, ఐసీటీసీ కౌన్సిలర్ సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ రఫీయొద్దీన్, హెల్త్ సూపర్‌వైజర్ ఉత్తమ్, చేతన ఎన్జీఓ పీఎం సతీష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూరు : ఎయిడ్స్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అవినాష్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ ఫాతిమా బేగం, ఎల్‌టీ రాజావర్ధన్, ఫార్మసిస్ట్ అయేషా, ఏఎన్ఎం సుష్మిత ఉన్నారు.



బెజ్జూర్ : ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా జట్టు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో జరిగిన 46వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ఫైనల్‌లో విజయం సాధించింది. ఆదివారం మహబూబ్ నగర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 21-14 గోల్స్ తేడాతో గెలుపొంది రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టును హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, కార్యదర్శి కనపర్తి రమేష్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి, ఏసీఎంఓ ఉద్దవ్, కోచ్‌లు జూనియర్ సునార్కార్ అరవింద్, గోగర్ల సాయితో పాటు పలువురు అభినందించారు.

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి దిశగా చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖను పటిష్టం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరకాలం పూర్తి కావస్తుందని, ఈ సంవత్సర కాలంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అందించామన్నారు. ప్రతి పాఠశాలకు ఉచిత విద్యుత్, ఉన్నత పాఠశాలలలో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు విద్యాబోధనకు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంలో భాగంగా 281 మంది ఉపాధ్యాయులను నియమించామని, దాదాపు 340 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడం జరిగిందని, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పాఠశాలకు ఆహార భద్రత కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని సూచించారు. విద్యతో పాటు క్రీడా, సంగీతం ఇతర రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల విద్యాధికారి రాథోడ్ సుభాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రక్షణ చర్యలు తీసుకోవాలి

సిర్పూర్(టి) : మహిళలు వంట గ్యాస్ స్టవ్‌ను వెలిగించే సమయంలో జాగ్రత్తలు తీసుకొని వంట చేయాలని జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎం.ఉదయ బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో హెచ్‌పీ, భారత్, ఇండియన్ గ్యాస్ జిల్లా డీలర్ల ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించారు. వంట గ్యాస్ వెలిగించే సమయంలో గ్యాస్‌ను వెలిగించే సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వంటగది వెలుతురు ఉండే ప్రక్కన గ్యాస్ స్టవ్‌ను ఉంచాలని సూచించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాగసుధా, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ మండల అధ్యక్షుడుగా చౌదరి హరి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల ఆర్ఎంపీపీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడుగా చౌదరి హరి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని గాయత్రి పాఠశాలలో ఆదివారం జరిగిన మండల సమావేశంలో సంఘం నాయకులు అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా, సమీప ప్రత్యర్థి జునుగరి శేఖర్‌పై 14 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి విష్ణు విశ్వాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్పుతే తిరుపతి, కోశాధికారిగా చప్లె అంజన్న, ఉపాధ్యక్షులుగా చందు, విలాస్, కార్యదర్శులు డోంగ్రే సదాశివ్, మిథున్, లక్ష్మణ్ గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ నాగపురె ప్రభాకర్, చౌదరి ప్రశాంత్, ప్రచార కార్యదర్శులు శ్రీను, ప్రశాంత్, బాబ్లు గౌరవాధ్యక్షులు శంకర్, బొజ్జ హరికృష్ణ, నారాయణ, శేఖర్, శ్రీను రాజశేఖర్, హనుమంతులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీ సమస్యల తనవంతుగా పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు సేవా భావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం కూడా ఆర్ఎంపీపీఎంపీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా స్థాయిలో విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్‌పెక్టర్ అవార్డు ప్రదర్శనలో భాగంగా ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా సదస్సులో జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన జెడ్‌పీ హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె విష్ణుప్రియ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి అడిషనల్ కలెక్టర్ మోతిలాల్ చేతుల మీదుగా మెమొంటం, ప్రశంస పత్రం అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు యశోదర మాట్లాడుతూ రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో, ప్రతిభ కనబరిచి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఏ పని చేసినా కష్టపడి చేస్తే విజయం తప్పకుండా వరిస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2001-2002 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులతో వారికి అనుబంధాలను నెమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా స్టేడియంలో అభిమానం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఆస్ట్రేలియాలో కొనసాగుతున్న టెస్ట్ క్రికెట్ వీక్షించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు తమ నాయకుడిపట్ల అభిమానం చాటుకున్నారు. అక్కడి స్టేడియంలో క్రికెట్ తిలకించిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్‌కుమార్-లక్షెట్టిపేట 14వ వార్డు కౌన్సిలర్ సువర్ణ దంపతులు సీఎం రేవంత్‌రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఫ్లెక్సీని ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్ర

- ఆకతాయిల ఆటకట్టించిన పోలీసులు



నవతెలంగాణ-మందమర్రి

ఆపరేషన్ చబుత్రతో మందమర్రి పోలీసులు ఆకతాయిల ఆటకట్టించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి సర్కిల్‌లోని ఐదుగురు ఎస్ఐలు, 25 పోలీస్ సిబ్బందితో 5 పెట్రోలింగ్ పార్టీలుగా పట్టణాన్ని అష్టదిగ్బంధం చేసి ఆపరేషన్ చబుత్రను చేపట్టారు. ఆవారాగా తిరుగుతున్న 35 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు. వీరి నుంచి 15 బైకులు, 1 కార్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి ఆకారణం గా రోడ్లపై కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి అరుగుల మీద బాతకానీలు కొడుతూ, రోడ్లమీద వాహనాలపై ఇష్టానుసారం తిరుగుతూ కాలనీవాసులను ఇబ్బందికి గురిచేస్తున్న వారిపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతూ గొడవలు సృష్టిస్తున్న, అనుమానస్పదంగా తిరిగే వారిని ఉపేక్షించమని హెచ్చరించారు.

కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే చర్యలు

నవతెలంగాణ-జన్నారం



కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే సహించబోమని ఇందన్‌పల్లి రేంజ్ ఆఫీసర్ కారం శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ గుట్టు చప్పుడు కాకుండా తమ సిబ్బంది కండ్లు కప్పి దొంగ చాటుగా చోటా మోటా స్మగ్లర్లు విలువైన కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అలాంటి వారిని పట్టుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ఇటీవలే అనేక మంది కలప స్మగ్లర్లపై కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరిగిందని, మరి కొంత మంది పేర్లు తమ వద్ద ఉన్నాయని, వారిని పట్టుకొని కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కలప స్మగ్లింగు ఎవరైనా తమ సి బ్బంది సహకరించినట్లు విచారణలో తేలితే వారిపై సైతం చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా కలప స్మగ్లర్లు స్మగ్లింగ్కు దూరంగా ఉండి ఇతర పనుల్లో నిమగ్నంకా వాలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి పగలు తేడా లేకుండా తమ సిబ్బంది ఇంధన్‌పల్లి రేంజ్‌లో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, అదే విధంగా చెక్‌పోస్టులలో సైతం సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా కలప స్మగ్లింగ్ చేస్తే తమకు నేరుగా కాని, ఫోన్‌లో గాని సమాచారం ఇవ్వాలని, అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-మందమర్రి

సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 2001-2002 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగాలు సంసార జీవితంలో బిజీగా ఉంటున్న వారంతా 24 ఏళ్ల తర్వాత అందరూ పాఠశాలకు చేరి సందడి చేశారు. 80 మంది విద్యార్థులు ఒకే వేదిక మీద కలవడంతో కొందరు ఉద్వేగానికి లోనయ్యారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆత్మీయంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి గౌరవించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గురువులు, తల్లిదండ్రుల ఆశీస్సుల మేరకు జీవితంలో స్థిరపడటం జరిగిందని తెలిపారు. గురువులను, చిన్ననాటి స్నేహితులను ఒకే వేదిక మీద కలవడం సంతోషంగా గర్వంగా ఉందని తెలిపారు. పూర్వ విద్యార్థుల తరఫున పాఠశాలకు తగిన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధాన చార్యులు రావుల సుధాకర్, మంచిర్యాల విభాగం అకాడమిక్ ఇన్‌చార్జి పుదారి సత్యనారాయణ, సరస్వతి విద్యా పీఠం మంచిర్యాల జిల్లా సహా కార్యదర్శి సూరం లక్ష్మీనారాయణ, మంచిర్యాల విభాగ్ ఆడిటర్ తొగరి పెంటయ్య ప్రస్తుత ప్రధాన చార్యులు కె శిరీష, సహచార్యులు ఎం సింహాచలం, ఎం కృష్ణమాచార్యులు, ఈశ్వరి మాతాజీ, వి వేణుమాధవ్, డి నాగరాజు, బి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, పాఠశాల సహచర సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

నవతెలంగాణ-తాండూర్



తాండూర్‌లో..

కొత్తగా పోలీస్ ఉద్యోగంలో చేరిన పోలీస్ కానిస్టేబుల్లు అంకితభావంతో పనిచేయాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. తాండూర్, బెల్లంపెల్లి రూరల్ సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో విధుల్లో చేరిన 51 మంది నూతన కానిస్టేబుళ్లకు ఆదివారం తాండూర్, తాండూర్‌రూరల్ సర్కిల్ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఉద్యోగం అంటేనే సవాళ్లతో కూడుకున్నదని శరీరకంగా, మానసికంగా, దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని నిలబడవచ్చాన్నారు. పోలీస్ శాఖ అనుసరిస్తున్న సాంకేతక పరిజ్ఞానం అందిపుచ్చుకుని నేరాల నియంత్రణ, శాంతి భద్రత పరిరక్షణకు పాటుపడాలన్నారు. తొమ్మిది నెలల శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధినిర్వాహణలో అన్వయించాలని తెలిపారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ , విధులను సక్రమంగా నిర్వర్తించాలని తెలియజేశారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించవద్దన్నారు. ఉద్యోగ బాధ్యతలు వచ్చిన సవాళ్లను ఎదుర్కోవాలని తెలిపారు. నిజాయితీతో విధులు నిర్వహిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సత్ప్రవర్తన సద్భావన కలిగి ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లకు బాధతో వచ్చి వారి పట్ల మర్యాదతో ప్రవర్తించి మేమున్నామన్నా భరోసా కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో తాండూర్ సీఐ కుమారస్వామి, దేవయ్య, బెల్లంపల్లి రెండవ పట్టణ ఎస్ఐ మహేందర్, తాళ్ళగురిజాల ఎస్ఐ రమేష్, నెన్నెల ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

జైపూర్ : పోలీస్ శాఖలో కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతం పాటుపడాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం భీమారం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన 8 మంది శిక్షణ పూర్తి చేసుకుని భీమారం పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేసినట్లు తెలిపారు. విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు విధుల నిర్వాహణలో క్రమ శిక్షణ కలిగిన వుండి ఉద్యోగంలో రాణించాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉద్యోగం చేయడమంటే అనేక విధాలుగా శారీరక, మానసిక ప్రశాంతత కలిగివుండాలని తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రజల్లో కలిసిపోయి ఉండటం ద్వార వాస్తవ పరిస్థితులను గుర్తించి నేరాలను అదుపు చేయడం సులువవుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్ఐ శ్వేత పాల్గొన్నారు.



జైపూర్‌లో..

మందమర్రి : ప్రజల రక్షణ పోలీసుల కర్తవ్యంగా పని చేయాలని శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన కానిస్టేబుళ్లకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకుని మందమర్రి సర్కిల్‌కు కేటాయించబడిన 23 మంది కానిస్టేబుళ్లకు ఆదివారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, దేవపూర్ ఎస్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

సింహ గర్జనకు బయలుదేరిన మాలలు

నవతెలంగాణ-జన్నారం

హైదరాబాదులోని పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జనకు మండలం నుంచి మాల సంఘం నాయకులు బస్సులలో భారీగా బయలుదేరి వెళ్లారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హైదరాబాదులో మాల సంఘం నాయకులు మాలల సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఆదివారం మండలంలోని చింతగూడ, మందపల్లి, రాంపూర్, తిమ్మాపూర్, కిష్టాపూర్, కలమడుగు, కవ్వాల్, ఇందంపల్లి, రేండ్లగూడ తదితర గ్రామాలనుంచి పెద్ద ఎత్తున మాల కులస్తులు ప్రత్యేక వాహనాలలో హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం మండల అధ్యక్షుడు పాత బాలరాజు జిల్లా నాయకులు సిటిమల్ల భరత్ కుమార్, జక్కుల సురేష్, బెంజిమెన్ దాముఖ కరుణాకర్, మేకల మాణిక్యం, వెంకటేష్, రాజన్న, మల్లేష్, శ్రీనివాస్, బోట్ల భాగ్య రావు, పద్మారావు, యోనా మల్లేష్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : సబ్బండ వర్గాల ఐక్యత కోసమే మాలల సింహగర్జన సభ అని మాల జేఏసీ కన్వీనర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దమ్మ నారాయణ అన్నారు. ఆదివారం పట్టణం లోని మొదెల గ్రామం నుంచి మాలలు హలో మాల చలో హైదరాబాద్ సభకు తరలి వెల్లారు. ఈ కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు మామిడి ప్రసాద్, మల్లేష్, దమ్మ కిరణ్ కుమార్, నరేష్, కుమార్ పాల్గొన్నారు.



నస్పూర్‌లో..



కాసిపేటలో..

కాసిపేట : హైద్రాబాద్‌లో నిర్వహించే మాలల సింహ గర్జన సభకు కాసిపేట మండలం నుంచి బారీగా నాయకులు తరలివెళ్లారు. మండలం నుంచి రెండు బస్‌లు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ముందుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ల అర్పించారు. హైదరాబాద్ కు తరలి వెళ్లిన వారిలో మాల మహానాడు నాయకులు అల్కా రాజు , పిట్టల సుమాన్, మాసు సుధాకర్, కటిక శంకరయ్య, కొప్పుల శంకరయ్య, కటిక వరం, సత్తా తరుణ్ కుమార్, కటిక శ్రావణ్ వర్మ, జాగృతి రామయ్య, నల్లల గట్టయ్య, పడిదం పోశయ్య, రాగం కాంతారావు, తొగరి నర్సయ్య, ఆల్క రాయలింగు, దార పద్మారావు, నల్లాల సంతోష్, ఆశాది ఆషాలు, అశోక్ ముకిడి, అరికట్ల పోషాలు పాల్గొన్నారు.

నస్పూర్ : హైదరాబాద్ నిర్వహించిన మాల సింహగర్జనకు మున్సిపాలిటీ నుంచి మాలలు భారీగా తరలి వెళ్లారు. ముందుగా సీసీసీ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం నాయకులు జింజుపెల్లి నర్సింగ్, తలారి రాజు, గుమ్మడి శ్రీను, గోసిక మనోజ్, గరిసే రామస్వామి, బోడ మోహన్, చీదురు సంతోష్, జివాజీ నందయ్య పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయి

- తాండూర్ సిఐ కుమారస్వామి

నవతెలంగాణ-తాండూర్



క్రీడలు స్నేహాన్ని ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఆదివారం తాండూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలోని క్రీడామైదానంలో తాండూర్ ప్రీమియం లీగ్ (టీపీ యల్)క్రికెట్ టోర్నమెంట్ యాక్షన్ (క్రీడాకారుల వేలం పాట)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడల్లో పోటీ తత్వం ఉన్నప్పటికీ క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. గెలిచినవారు క్రీడా స్ఫూర్తిని ఓడినవారు ఓటమికి గల కారణాలను వెతకాలని సూచించారు. క్రీడాకారులు స్నేహపూర్వకంగా సమన్వయంతో క్రికెట్ ఆటల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. క్రికెట్ పోటీలను నిర్వాహకులు గొడవలకు తావివ్వకుండా సజావుగా నిర్వహించాలని కోరారు. ఈ ప్రీమియర్ లీగ్‌లో 10 టీంలు పాల్గొంటాయని, టీపీఎల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న 172 మంది క్రీడాకారులను యాక్షన్ ద్వారా వివిధ టీంలు దక్కించుకుంటాయని నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల్లో టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారం ఎస్ఐ బి సౌజన్య, నిర్వహకులు మైదం అనిల్ కుమార్, మసాడి శశివర్ధన్, శాలిగామ శివ, అలీమ్ ఖాన్, మిట్ట వెంకటస్వామి, సహన కిరణ్, సల్మాన్ పాల్గొన్నారు.



పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గట్రావ్‌పల్లి గ్రామంలో ఆదివారం ముత్యంపల్లికి చెందిన మంద ఐలయ్య తన కూతురు జన్మదినం సందర్భంగా 100 మంది పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంద్రం రాజు, మాజీ కోప్షన్ మెంబెర్ సిరాజ్ ఖాన్, మేరుగు శంకర్ పాల్గొన్నారు.

మాదిగలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మాదిగలను తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తుందని, మేమెంత మందిమో మాకంత వాటా దక్కాల్సిందేనని, ఏబీసీడీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెనిగారపు మురళికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఎంఆర్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న ఎంఆర్పీఎస్ పట్టణ, మండల కమిటీలు వేస్తున్నామని, సీనియర్ నాయకులు, ఎంఆర్పీఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఏబీసీడీ వర్గీకరణ ద్వారానే మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. మా వాటాను మేమడుగుతుంటే కొంతమంది ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. సమ న్యాయం కావాలనే సుప్రీం కోర్టు ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, సుప్రీం కోర్టు తీర్పును అందరు గౌరవించాలన్నారు. తెలంగాణ సర్కార్ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని అయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో జరగబోయే ఉద్యమాలకు మాదిగ-మాదిగ ఉపకులాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు చిప్పకుర్తి నారాయణ, కల్లెపల్లి విక్రం, తోటపల్లి మహేందర్, బెడిగం రాజశేఖర్, కమటం ప్రవీణ్, దర్శనాల నవీన్, బడుగు రాజేష్, బోనగిరి దుర్గా ప్రసాద్, బోనగిరి మహేష్, రేగుంట సుధాకర్, అల్లంపల్లి రమేష్ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై అవగాహన



నవతెలంగాణ-కాసిపేట

మండల పరిధిలోని కోమటి చేను, యాప గ్రామాలలో ప్రజా పాలనా ప్రజా విజయోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలపై అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో మరెన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 19 తేదీ నుంచి డిసెంబర్ 7 వరకు ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలు కొనసాగుతాయని కళాజాత టీం లీడర్ లావుడ్య రమేష్ తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో సారధి కళాకారులు మామిళ్ల లచన్న, గొడిసెల కృష్ణ, సల్లూరి కృష్ణ, రామటెంకి రాజా తిరుపతి, వావిలాల నాగలక్ష్మి, కాసిపేట సంతోష్ పాల్గొన్నారు.

బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్



గత రెండు రోజులుగా మంచిర్యాల ట్రినిటీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న బాల వైజ్ఞానిక ప్రదర్శన్‌లో మాదారం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చందనాల అజయ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇన్స్‌పైర్ మానాక్ ఎగ్జిబిషన్‌లో జిల్లా స్థాయిలో జరిగిన 149లు ప్రాజెక్టులు ప్రదర్శించగా చందనాల అజయ్ రూపకల్పన చేసినటువంటి ఉమెన్స్ సేఫ్టీ రబ్బర్ బ్యాండ్ రాష్ట్రస్థాయికి సెలక్ట్ అయింది. గైడ్ టీచర్ ఐ విద్యాసాగర్ ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. ఉపాధ్యాయ విభాగంలో కాసిపేట ఎంపీపీ ఎస్ పాఠశాలకు చెందిన గంప శ్రీనివాస్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గంప శ్రీనివాస్ తయారు చేసిన ప్రాజెక్టు ఎఫ్ఎల్ఎన్, ఎల్ఈపికి సంబంధించిన మ్యాథమెటిక్స్ మోడల్స్ ఎంపికదారుల మన్ననలు పొందింది. ఉపాధ్యాయ విభాగంలో గంప శ్రీనివాస్ ఈసారి ఎంపికతో ఐదు సార్లు రాష్ట్రస్థాయికి ఒకసారి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విద్యాధికారి మల్లేశం తాండూరు మండలం నుండి ఎంపికైన విద్యార్థికి ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమే

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమేనని ఎంఈఓ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సెకండరీ (బాలుర) పాఠశాలలో అక్కుల మల్లేశం ఎస్ఏగా ఉద్యోగవిరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమని. మల్లేశం ఎంతో కష్టపడి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారని, అందుకే ఆయనకి చదువు విలువలు బాగా తెలుసని అదే స్థాయిలో తన విద్యార్థులను తీర్చి దిద్దాలని అనుక్షణం తపన పడేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో అభినవ శబరిమల గూడెం అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపకులు శ్రీమాన్ చక్రవర్తుల పురుషోత్తమ గురు స్వామి విశిష్ట అతిథిగా పాల్గొని మల్లేశం దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షురడు కట్ట రాజమౌళి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యా సంఘం రాష్ట్ర అధ్యఉడు జాడి రాజన్న, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, నాయకులు రాంటెంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖానాపూర్ యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడిగా ఎస్కే షకీల్

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణ యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడిగా ఎస్కే షకీల్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక విశ్రాంతిభవనంలో ఆయా కాలనీలకు చెందిన యూత్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నూతనంగా యంగ్ స్టార్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్కే షకీల్, ఉపాధ్యక్షుడిగా అల్‌హాజ్, ప్రధాన కార్యదర్శిగా అఖిల్, కోశాధికారిగా మాజిద్‌లతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎంసెట్‌కు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఆదివారం మోటివేషన్ క్లాస్ ఏర్పాటు చేశారు. దీనికి మోటివేషనల్ స్పీకర్, రిటైర్డ్ ప్రొఫెసర్ సల్ల విజయబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవితంలో ఎలా పైకి రావాలి వివరించారు. పరీక్షలో ఎలా విజయం సాధించాలి, ఏ విధంగా గుర్తు పెట్టుకోవాలలో తెలియజేశారు. ఎంపిక చేసుకున్న లక్ష్యం ఎలా సాధించాలలో మొదలైన అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ఇంటర్మీడియట్ సూపరింటెండెంట్ మోసీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ట్రాన్స్‌జెండర్స్ పట్ల ప్రతి ఒక్కరు గౌరవాన్ని కలిగి ఉండాలని తెలంగాణ విద్యావంతుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు గురిజాల రవీందర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్‌లో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన నాగిళ్ల రవీందర్ రచించిన ట్రాన్స్ మహిళా మణులు పుస్తకాన్ని చైతన్య సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్‌లను సమాజం చిన్న చూపు చూడటం వల్లే వారు భిక్షాటనకు మొగ్గు చూపుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు, సమాజం వెలివేయడం కారణంగా వారి జీవనం దౌర్భాగ్యంగా మారుతోందని అన్నారు. పుస్తక సమీక్షకులు, కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయుడు మహిపాల్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్ జీవన స్థితిగతులపై నాగిళ్ల రవీందర్ అద్భుతమైన రచన చేశారని అన్నారు. వారి జీవితం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్న కారణంగానే ఈ పుస్తకాన్ని ఆయన రచించగలిగారని కొనియాడారు. ఈ పుస్తకం ద్వారానైనా సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ పట్ల గౌరవం పెరగాలని ఆకాంక్షించారు. పుస్తక రచయిత నాగిళ్ల రవీందర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్‌ల జీవితాలను ప్రత్యక్షంగా చూసిన కారణంగానే వారి బాధలను, కన్నీళ్లను అర్థం చేసుకొని ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. రాబోయే రోజులలో వారి బాధలపై మరింత విస్తృతంగా రచనలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉప్పుల నరసింహాచారి వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు మేడి చరణ్‌దాస్, రాజకమలాకర్‌రెడ్డి, సుందిళ్ల రాజన్న, కటకం మధూకర్, ఆసిఫాబాద్ కవుల సంఘం సభ్యులు నల్లగొండ రమేష్, గుర్రాల వెంకటేశ్వర్లు, ధర్మపురి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జయదేవ్ అబ్రహం, సీపీఐ (ఎం) నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, ట్రాన్స్‌జెండర్‌లు పుష్పిత, లయ, గాయత్రి, తేజస్విని, అక్షర పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయంలో వసతి గృహాల పరిస్థితి దారుణం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఫరెజ్
- సందర్శనకు వెళ్లిన నాయకులు అరెస్ట్



ఉట్నూర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ హయంలో వసతి గృహాల పరిస్థితి దారుణంగా తయారైందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఫరెజ్ అన్నారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్వీ వసతిగృహాల బాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఆదివారం పట్టణ శివారులోని బీసీ వసతి గృహాన్ని సందర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను మావల పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ ముందు బీఆర్ఎస్వీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫరెజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ సంవత్సర కాలంలో వసతిగృహాలను పట్టించుకోలేదన్నారు. మరణించిన కుటుంబాలను పరామర్శించకుండా మంత్రులు మాత్రం బీఆర్ఎస్ కుట్రలు చేస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అరెస్టులతో తమను అపాలేరని, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించే వరకు తమ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు శివ, కలీం, ధమ్మపాల్, ప్రశాంత్, బట్టు, రఘు, రాజేష్, మోసిన్ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : వసతి గృహ విద్యార్థులను సంరక్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ షేక్ ఫరెజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో మహాత్మ జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌ను జిల్లా అధ్యక్షులు బుట్టి శివ కుమార్‌తో కలిసి సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలుసుకునే ప్రయత్నంలో పోలీసులు బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగాన్ని అరెస్టు చేసి అడ్డుకున్నారు. లోనికి అనుమతి నిరాకరించడంతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్ నాయక్, దమ్మపాల్, పరమేశ్వర్, నియోజకవర్గ అధ్యక్షులు ప్రశాంత్ వాగ్మారే, బట్టు సతీష్, రఘు, రాజేష్, మోసిన్, సాబీర్, కలీం పాల్గొన్నారు.

ఉట్నూర్ : కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ గాడితప్పుతోందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫరెజ్, జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలను బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఫరెజ్, జిల్లా కోర్డినేటర్ బుట్టి శివకుమార్, ధరణి రాజేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్య కానీ స్నానం చేసే నీళ్లతో పిల్లలకు దురద లేచి చర్మ వ్యాధులు సోకుతున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైన ఈ హెల్ప్ లైన్ నెంబర్ 8522044336 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాగ్మరే ప్రశాంత్, మహమ్మద్ ముజీబ్, పవార్ క్రాంతి, సాజీద్, రఘు, రాజేష్, కాలీం, షోహెబ్, మోసిన్, అభిలాష్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తిరుమల నగర్‌లోని శ్రీ అలివేల మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు, జాతరను భక్తులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఎన్నో ఏండ్లుగా భక్తిశ్రద్ధలతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వారిని తన తరఫున అభినందించారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్, ఆకుల ప్రవీణ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు తోడ్పడుతాయి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- జిల్లా కేంద్రంలో 2కే రన్



ఆసిఫాబాద్ : జెండా ఊపీ 2కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో మానసిక శారీరక ఉల్లాసానికి క్రీడలు తోడ్పడతాయని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలో సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా కలెక్టరేట్ నుండి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన 2కే రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల వేడుకలను ప్రభుత్వం పండగ వాతావరణంలో ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 2కే రన్ నిర్వహించామన్నారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. క్రీడాకారులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ రమాదేవి, జీసీడీఓ శకుంతల, పీడీలు, పీఈటీలు, వాలీబాల్ అకాడమీ క్రీడాకారులు, యువతీ యువకులు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు, మహిళా సంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.



కౌటాల : వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎమ్మార్సీలో ప్రజా పాలన విజయోత్సవాలు

కౌటాల : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో మండల విద్యాధికారి గావుడే హనుమంతు ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థులకు ప్రజా పలనపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కౌటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కే.సాయికృష్ణ మొదటి బహుమతి సాధించగా కేజీబీవీ పాఠశాలకు చెందిన కె.గంగ ద్వితీయ బహుమతి సాధించారు. ఇన్ఫంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి కె.సాయి శరణ్య తృతీయ బహుమతి సాధించగా వారికి మండల విద్యాధికారి బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందని, మండలానికి ఒక విద్యాధికారిని మోడల్ స్కూలు కొత్త ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్యామ్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరి : మండలంలోని మోడీ ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు జరిగాయి. ప్రతిభ కనభర్చిన విద్యార్థులకు మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో విద్యాధికారి ఆడే ప్రకాష్, ఝరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భరత్ రావ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కెరమెరి : విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలు పురస్కరించుకొని ఆయా పాఠశాల విద్యార్థులకు ఎంపీఓ సుధాకర్ రెడ్డి, ఎంఈఓ జయరాజ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గున్నందుకు వారిని అభినందించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ బహుమతులు పొందడమే కాదని పోటీలలో పాల్గొనడమే చాలా ప్రాముఖ్యమైన విషయమని తెలిపారు. అనంతరం ప్రథమ బహుమతి జిల్లా పరిషత్ పాఠశాల బాబాసాగర్ బి. జస్వంత్, ద్వితీయ బహుమతి జిల్లా పరిషత్ గాయత్రి పాఠశాల పి. వైష్ణవి, తృతీయ బహుమతి వి. వేణు గెలుపొందగా వారికి బహుమతులను పంపిణీ చేశారు.



చింతలమానేపల్లి : కేజీబీవీలో ప్రజాపాలనపై అవగాహన కల్పిస్తున్న ఎంపీఓ

కంకాలమ్మ జాతరకు పోటెత్తిన భక్త జనం

- పక్క రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తులు
- జన సంద్రంగా మారిన కంకాలమ్మ క్షేత్రం
- భారీగా పోలీసు బందోబస్తు
- అమ్మ వారిని దర్శించుకున్న కలెక్టర్



నవతెలంగాణ-కౌటాల

స్వయంభు శ్రీ కేతేశ్వర కంకాలమ్మ అమ్మవారి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం చివరి ఆదివారం అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఆదివారం జాతరకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మండల కేంద్రం నుంచి మొదలు కంకాలమ్మ గుట్ట మొత్తం జనసంద్రంగా మారింది. అమ్మవారిని కోరిన కోరికలు తీరడంతో నమ్మకంతో ఈ ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలోని అల్లు బండ వద్ద భక్తులు తమ కోరిన కోరికలను తీర్చుకోవడానికి బండను లేపారు. ఆలయ గజస్తంభం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. మొక్కులు తీరిన వారు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద వస్తువులు కొనుగోలు చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. జాతరలో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆట వస్తువుల వద్ద పిల్లలు సందడి చేశారు.

అమ్మ వారిని దర్శించుకున్న కలెక్టర్

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే కుటుంబ సభ్యులతో కలిసి కేతేశ్వర కంకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు సుల్వ కళ్యాణి కనకయ్య స్వాగతం పలికారు. పూజలు చేయించినంతరం కలెక్టర్‌ను శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా కాగజ్‌నగర్ డిఎస్పి రామానుజన్ అమ్మవారిని దర్శించుకొని ముక్కులు చెల్లించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు.

ఆర్ఎంపీపీఎంపీల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ

ఆర్ఎంపీపీఎంపీల ఆధ్వర్యంలో జాతర సందర్భంగా వచ్చిన భక్తులకు పులిహోర పంపిణీ చేసి సామాజిక బాధ్యతను చాటారు. అదే విధంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తమ వంతుగా సహకారం అందించారు. వైద్యమే కాదు.. సామాజిక కార్యక్రమాల్లో ఉంటామని తెలియజేశారు. అదే విధంగా కాగజ్‌నగర్‌లోని రుద్ర హస్పిటల్ ఆధ్వర్యంలోనూ పులిహోరపంపిణీ చేశారు.

భారీ బందోబస్తు

కంకాలమ్మ అమ్మవారి జాతరలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాగజ్‌నగర్ డిఎస్పి రామానుజన్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌటాల సీఐ ముత్యం రమేష్ ఎప్పటికప్పుడు బందోబస్తును పరిశీలించారు. ఎనిమిది మంది ఎస్ఐలు మధుకర్, నరేష్, ప్రవీణ్, రాజు, కమలాకర్‌తో పాటు 120 మంది పోలీసులతో బందోబస్తులో ఉన్నారు.





బీజేపీలో పలువురి చేరిక

నవతెలంగాణ-భైంసా

మండలంలోని దేగామ గ్రామానికి మాజీ వార్డుమెంబర్ భోజరాం పటేల్, మాజీ గ్రామాభివృద్ధి కోశాధికారి బెల్గాం పోతన్న, అల్లం సాయినాథ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువాలు కప్పి ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, ఎవరికి భయపడవద్దని సూచించారు. దేగామ గ్రామాభివృద్ధికి తనవంతుగా పాటుపడతానన్నారు. అభివృద్ధి పరంగా ఎంతో వెనకబడిందని, ప్రజలు బీజేపీలో చేరడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్‌బాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, నాయకులు సొలంకి భీమ్‌రావ్, బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి, స్థానిక నాయకులు కిష్టయ్య, చంద్రకాంత్ పటేల్, లింగన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా ఆరట్టు ఉత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హరిహర సుతుడి నామస్మరణతో ఆదిలాబాద్ పట్టణ పుర వీధులు మారుమోగాయి. దీక్షదారుల భజన సంకీర్తనలు, కేరళ నుం,ఇ ప్రత్యేకంగా తెప్పించి డోలు వాయిద్యాల చప్పుళ్లతో ఆరట్టు ఉత్సవం అత్యంత వైభవోపేతంగా సాగింది. జిల్లాకేంద్రంలోని ప్రధాన వీధులు అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగగా భక్తులు భక్తి పారవశ్యంతో ఉత్సవంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠం నుంచి ఆరట్టు ఉత్సవం ప్రారంభం కాగా పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతితో పాటు దీక్షాధారులతో కలిసి ఉత్సహంగా నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా ఆరట్టు ఉత్సవం కొనసాగగా దారి పొడవునా భక్తులు పల్లకీకి పూజలు చేస్తూ స్వామివారిని వేడుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన అయ్యప్ప స్వామి దీక్షాదారులు భక్తి పారవశ్యంతో ఉత్సవంలో పాల్గొనడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అదేవిధంగా మాజీ మంత్రి జోగు రామన్న సతీ సమేతంగా ఉత్సవంలో పాల్గొని పల్లకీకి ప్రత్యేక పూజలు చేశారు. పల్లకి ఊరేగింపులో పాల్గొని అయ్యప్ప నామస్మరణ చేస్తూ శోభయాత్రలో భాగస్వామ్యులయ్యారు. అదేవిధంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి సైతం పల్లకి ఊరేగింపు వేడుకలో పాల్గొన్నారు. ఈ మేరకు కార్యక్రమ అతిథులు, నిర్వాహకులు మాట్లాడుతూ ఆరట్టు ఉత్సవం జరిగిన రోజు నుంచి బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతి రోజు అన్నదానం, పడిపూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం సైతం వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధల నడుమ జరుపుకోవడం హర్షనీయమని పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి కృపా కటాక్షలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆరట్టు మహోత్సవం సందర్భంగా బెల్లూరి అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పల్లకి సేవ, ఊరేగింపులో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని, పండ్లను పంపిణీ చేశారు. గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానందసరస్వతి ఆధ్వర్యంలో ప్రారంభమైన పల్లకి యాత్ర పెన్‌గంగా నది వరకు సాగిందన్నారు. ఈ సందర్భంగా గురుస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు దారట్ల జీవన్, అధ్యక్షుడు కుంబోజి సూర్యకాంత్, ప్రధాన కార్యదర్శి దమూక రవీందర్, ట్రెజరర్ టింగం నరేష్, గురుస్వాములు అనిల్ దేశ్‌పాండే, సత్యనారయణ మూర్తి, సునీల్, రాము, సాయినాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాయిని రవి, గంగారెడ్డి, రవిందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధర్మపురి చంద్రశేఖర్, నవీన్‌రెడ్డి, గంద్రత్ వెంకటేష్, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు, ఆలీం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన దీక్ష

నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర బీజేపీ నాయకుడు రితేష్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండలంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉట్నూర్, ఇంద్రవెల్లి మండల రైతులు అందరూ కలిసి ఒక్క రోజు రైతు దీక్ష చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేయడంతో రైతుబంధు రాక, రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన జీసీసీ సరుకులు

- సరుకుల వ్యాన్ పోలీసు స్టేషన్‌కు తరలింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గిరిజన కో ఆపరేటివ్ కార్పోరేషన్ లిమిటెడ్‌కు చెందిన నిత్యావసర సరుకులు పక్కదారి పడుతున్నాయి. ఆదివారం కాగజ్‌నగర్ మండలం డాడానగర్ వద్ద ఈ సరుకుల వ్యాన్ ప్రయివేట్ వ్యక్తి ఇంటి వద్దకు వచ్చింది. ఈ వ్యాన్‌లోని సరుకులను ఆ ఇంటిలో దింపేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ వ్యాన్‌ను టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇందులో ఎండు కారం, ఎండు మిరపకాయలు, ఇతర పప్పుధాన్యాలు ఉన్నట్లు సమాచారం. వీటిని కాగజ్‌నగర్ పట్టణంలోనే ఉన్న గిరిజన కో ఆపరేటివ్ కార్పోరేషన్ కార్యాలయంకు చెందిన గోదాంలో దించాలి. కాని అక్కడ కాకుండా డాడానగర్‌లోని ప్రయివేట్ వ్యక్తి ఇంట్లో ఈ సరుకులను దించడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై కార్పోరేషన్ మేనేజర్ భుక్యానాయక్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్‌ను సంప్రదించగా తమకు అందిన సమాచారం మేరకు సరుకుల వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నామని, స్థానిక తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సోమవారం దీనిపై విచారణ జరిపి ఆ సరుకులు సక్రమమా, లేక అక్రమమా అనేది తేలుస్తామని తెలిపారు.



ప్రయివేట్ వ్యక్తి ఇంటి వద్ద సరుకులు దించేందుకు వచ్చిన వ్యాన్